క్లుప్తంగా

కారెంపూడి సీఐగా శ్రీనివాసరావు



కారెంపూడి: కారెంపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా టీవీ శ్రీనివాసరావు శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు పోలీస్ సిబ్బంది నూతన సీఐకి శాలువాలు కప్పి పూలమాలలతో స్వాగతం పలికారు. అలాగే పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు సీఐని కలశారు. కారెంపూడి సీఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

సీఐగా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకరరావు



మాచర్ల : మాచర్ల పట్టణ సీఐగా ప్రభాకరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు రేంజ్ నుంచి మాచర్లకు సీఐగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సీఐ ప్రభాకరరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో సీఐగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యతలు చేపట్టానన్నారు. శాంతి భద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా చర్యలు చేపడతానన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తానన్నారు. అనంతరం పోలీసు సిబ్బంది మర్యాదపూర్వకంగా సీఐను కలిసి అభినందనలు తెలిపారు.

ఇద్దరు ఎస్‌ఐల బదిలీ

దాచేపల్లి : దాచేపల్లి సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐలుగా విధులు నిర్వహిస్తున్న దాసరి శివనాగరాజు, జి.సంధ్యారాణి బదిలీ అయ్యారు. పిడుగురాళ్ల ఎస్‌ఐగా శివనాగరాజు, సంధ్యారాణిని జిల్లా ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులను జారీ చేశారు. గత రెండేళ్లుగా శివనాగరాజు, సంధ్యారాణి దాచేపల్లిలో విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో సమర్థవంతమైన అధికారులుగా మంచి పేరు సంపాదించుకున్నారు.

రెంటచింతల ఎస్‌ఐగా సీహెచ్ నాగార్జున



రెంటచింతల: రెంటచింతల ఎస్‌ఐగా సీహెచ్ నాగార్జునను నియమిస్తూ పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సీహెచ్ నాగార్జున గుంటూరు జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(డీసీఆర్‌బీ)లో విధులు నిర్వహిస్తున్నారు. ఎస్‌ఐ నాగార్జున 2018 బ్యాచ్‌కు చెందిన వారు. ఇప్పటి వరకు రెంటచింతల ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఎం.ఆంజనేయులు 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై వచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దాచేపల్లి : మండల వ్యాప్తంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈలు భగవాన్‌నాయక్, నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతులు, విద్యుత్‌లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని వారు సూచించారు.

మాచర్లలో...

మాచర్ల : మాచర్ల విద్యుత్ శాఖ డివిజన్ పరిధిలో రెండో శనివారం 33 కేవీ రెంటచింతల, 33 కేవీ అగ్నిగుండాల కేంద్రం, అనుపు ఫీడర్‌లో విద్యుత్ సరఫరాలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రామయ్య శుక్రవారం తెలిపారు. 33/11 కేవీ దుర్గి సబ్ స్టేషన్, ముటుకూరు సబ్ స్టేషన్, రాయవరం, పోలేపల్లి సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెంటచింతలలో...

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని రైలుపేట, ఆంతోనివారి కాలనీ, వెంకటేశ్వరస్వామి మాణ్యం కాలనీ, జెండాచెట్టు సెంటర్ పరిధిలో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ షేక్ మస్తాన్‌వలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెంటచింతలలో జరుగుతున్న ఆధునీకరణ పనులలో భాగంగా నూతన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగల ఏర్పాటు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఆయా కాలనీల ప్రజలు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

9 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

మాచవరం: అక్రమంగా పేకాట ఆడుతున్న 9 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ అమీనుద్దీన్ శుక్రవారం తెలిపారు. మండల కేంద్రమైన మాచవరం ఎస్సీ కాలనీలో అక్రమంగా పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించగా 9 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.24,380 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యక్రలాపాలకు పాల్పడితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు.

ప్రజలకు ప'రేషన్' తప్పదా..!?

- దుకాణాల వద్ద క్యూ కట్టాల్సిందేనా..?
- రేషన్ వెతలు మళ్లీ మొదటికేనా..?
- చంద్రబాబు వ్యాఖ్యలపై పలువురి మండిపాటు



గురజాలలో రేషన్ వాహనం ద్వారా సరుకులు అందిస్తున్న దృశ్యం (ఫైల్)

గురజాల : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పేదలకు గడప వద్దకే రేషన్ సరుకులు అందించే బృహత్తర కార్యక్రమానికి పేదల నుంచి గతంలో ప్రశంసలు వెల్లువెత్తాయి. కానీ నేడు సీఎం చంద్రబాబునాయుడు మాత్రం ఆ విధానానికి స్వస్తి పలికే విధంగా చర్యలు చేపడుతున్నారు. రేషన్ దుకాణాల వద్ద క్యూలకు, తూకాల్లో మోసాలకు చెక్ పడే విధంగా గత ప్రభుత్వం చర్యలు చేపట్టగా నేడు మరలా ఆ వెతలు తప్పేలా లేవు. గత ప్రభుత్వ హయాంలో వలంటీర్లు, రెవెన్యూ అధికారులు వాహనం వెంట ఉండి ఎటువంటి అవినీతికి తావు లేకుండా రేషన్ పంపిణీ చేశారు. దీంతో రేషన్ కార్డుదారులు ఆనందంగా ఉన్నారు. కానీ నేడు చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయాలపై పలువురు రేషన్ కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా

గురజాల నియోజకవర్గంలో నాలుగు మండలాలు ఉన్నాయి. సుమారు గురజాల మండలంలో 38, దాచేపల్లిలో 42, మాచవరంలో 38, పిడుగురాళ్లలో 79 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అదే విధంగా గురజాల మండలంలో 21,396, దాచేపల్లిలో 22,689, మాచవరంలో 16,271, పిడుగురాళ్లలో 44,020 రేషన్ కార్డుదారులున్నారు. ఇంటింటికీ తిరిగి రేషన్ పంపిణీ చేసేందుకు గాను గత ప్రభుత్వం హయాంలో గురజాలలో 14, దాచేపల్లిలో 15, మాచవరంలో 11, పిడుగురాళ్లలో 24 ఎండీయూ వాహనాల ద్వారా చురుగ్గా పంపిణీ చేపట్టింది. సరుకులు నేరుగా ఇంటి వద్దనే ఇవ్వడం, నాణ్యమైన బియ్యం సరఫరా చేశారు. కానీ నేడు ఆ వాహనాలను తొలగించి పాత విధానంలో రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి క్యూలో గంటల తరబడి వేచి ఉండి రేషన్ తెచ్చుకునే విధంగా చర్యలు చేపడుతున్నారు.

బారులు తీరాల్సిందే

ప్రతి నెలా ఒకటో తేదీ వచ్చిందంటే వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు నిత్యావసర దుకాణాల వద్ద సరుకుల కోసం బారులు తీరాల్సిందే. ఏమైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి, సరుకులను డీలర్లు ఇచ్చిన సమయంలోనే తీసుకోవాల్సిందే బియ్యాన్ని చౌక దుకాణం నుంచి ఇంటికి తీసుకెళ్లే సమయంలో బరువు మోయలేక పడే ఇబ్బందులు మరలా తప్పేలా లేవు. రేషన్ వాహనాల ద్వారానే సరుకులు పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.

వృద్ధులు దివ్యాంగుల గురించి ఆలోచించండి

మాచర్ల: ఇంటి వద్దకే వచ్చి రేషన్ అందిస్తున్న రేషన్ పంపిణీ వాహనాలను యథావిధిగా కొనసాగించాలని రేషన్ కార్డుదారులు కోరుతున్నారు. సైరన్‌తో తమ వీధిలోకి వచ్చి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేసే వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. రేషన్ షాపు కెళితే మొదటి రెండు రోజులిచ్చి తర్వాత నుంచి నిర్లక్ష్యంగా రేషన్ డీలర్లు వ్యవహరించడం గతంలో చూశామని, మొదటి రెండు రోజులు వెళ్తే క్యూలైన్లో నిల్చోవాల్సి వస్తుందని దీని వల్ల ఆ రోజు పని కూలీ దండగ అవుతుందని పేద వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. నియోజకవర్గంలో సుమారు 65 వేల తెల్ల రేషన్ కార్డులు కలిగిన పేదలున్నారు. వీరంతా పనుల సీజన్‌లో తెల్లవారుజామున పనికి వెళ్తున్న పరిస్థితి. ఈ నెల రేషన్ తెచ్చుకోలేదనే బాధ కూలీకి వెళ్లి కూడా పొలంలో ఆవేదన చెందుతుంటారు. వారికి వీలున్నప్పుడు రేషన్ షాపుకు వెళ్తే రేషన్ తీసుకోడానికి అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని రేషన్ ఇంటింటికీ పంపిణీ చేస్తే వచ్చే అనర్థాలేమిటో ప్రభుత్వం ఆలోచించాలని పేదలు కోరుతున్నారు. ఇప్పుడు కొనసాగుతున్న ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థను కొనసాగనివ్వాలని కార్డుదారులు కోరుతున్నారు. దీనివల్ల ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధులు ఇళ్ల వద్దే రేషన్ తీసుకునే అవకాశం కలుగుతుందని అంటున్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కన్యకా పరమేశ్వరి





ప్రత్యేక అలంకారంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు, చౌడేశ్వరి అమ్మవారు



అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహిస్తున్న మహిళలు

రెంటచింతల: తొలి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాలలో వేంచేసిన అమ్మవార్ల ఆలయాలలో మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడంతో ఆయా గ్రామాలలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో, తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అర్చకులు మారుతి శర్మ ఆధ్వర్యంలో, బాలవికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సమీపంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో అర్చకులు అనీల్‌కుమార్ శర్మ నేతృత్వంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. దేవస్థానం అధ్యక్షులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని పాలువాయి జంక్షన్ వద్ద వేంచేసిన కనకదుర్గ అమ్మవారి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు

మాచర్ల : పట్టణంలోని పలు దేవాలయాల్లో తొలి శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశైలం రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగేంద్ర స్వామి పుట్టకు తెల్లవారుజాము నుంచే భారీ స్థాయిలో భక్తులు తరలి వచ్చి నాగ పంచమి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నెహ్రూనగర్‌లోని ఆదిలక్ష్మి అమ్మవారి దేవాలయం, కనకదుర్గ, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి, మాతా శ్రీ గాయత్రి దేవాలయాలతోపాటు పలు దేవాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాకంబరి అలంకరణలో అమ్మవారు

పిడుగురాళ్ల : శ్రావణ మాసం పురస్కరించుకుని పిడుగురాళ్ల పట్టణంలో వేంచేసియున్న కనకదుర్గ అమ్మవారు శుక్రవారం శాకంబరి దేవి అలంకరణలో దర్శనమిచ్చింది. శ్రావణ మాసం మొదటి శుక్రవారం కావడంతో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవాలయ సిబ్బంది చర్యలు చేపట్టారు.

అమ్మవారికి కుంకుమ పూజ

మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి కుంకుమ పూజా కార్యక్రమం చేపట్టారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేపట్టారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజ నిర్వహించారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



సేవాలాల్ కీమాలాల్ జంక్షన్‌లో నిర్వహిస్తున్న ఆదివాసీ దినోత్సవం

విజయపురిసౌత్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయపురిసౌత్‌లోని సేవాలాల్ కీమాలాల్ జంక్షన్‌లో టీడీపీ గిరిజన నాయకుడు కరంటోత్ పాండునాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ నాయకుడు డా.ఎన్.బసివిరెడ్డి హాజరయ్యారు. ముందుగా సేవాలాల్ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బసివిరెడ్డి మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్ పోరాటం ఫలితంగా ఆదివాసీలు తమ హక్కులు సాధించుకున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివాసీల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడావత్ బాలాజీ నాయక్, ముడావత్ మంగతా నాయక్, కేతావత్ రేకు నాయక్, బాణావాత్ నాగేశ్వరావు నాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

గిరిజనులను గౌరవించి అండగా ఉందాం

ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్



గిరిజన సంప్రదాయ వేష ధారణలో ఉన్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

రెంటచింతల: ప్రపంచవ్యాప్తంగా జాత్యహంకారం, వర్ణవివక్ష, సరళీకరణ వంటి అనేక కారణాల వలన ఇబ్బందులు పడుతున్న గిరిజన ప్రజలను మనమందరం గౌరవించి వారికి అండగా ఉందామని ఏపీ గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీ గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో మొత్తం 5 వేల విభిన్న గిరిజన తెగలు ఉన్నాయని వారు సుమారు 37 కోట్ల మంది అడవి బిడ్డలుగా జీవిస్తున్నట్లు తెలిపారు. సుమారు 7 వేల భాషలు మాట్లాడతారని ఇప్పటికీ గిరిజన ప్రజలు తమ ఉనికిని, సంస్కృతిని, గౌరవాన్ని కాపాడుకోవడానికి పోరాడుతున్నారని గుర్తు చేశారు. ఆగస్టు 9న ప్రపంచంలోని 90కి పైగా దేశాలలో ప్రపంచ గిరిజన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులు గిరిజన సంప్రదాయ అలంకారంలో ప్రదర్శనలు చేసి విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కన్నెగంటి హనుమంతు సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నారాయణం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులు మూఢ నమ్మకాలు విడనాడాలి



కంభంపాడు పీహెచ్‌సీలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ పద్మావతి

మాచర్ల రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలు అటవీ ప్రాంతంలో నివసించే చెంచులు మూఢ నమ్మకాలు విడనాడి ఆరోగ్య రక్షణ కోసం వైద్యశాలలకు వచ్చి పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు ఎల్.పద్మావతి కోరారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ (గిరిజన) దినోత్సవం సందర్భంగా కంభంపాడు పీహెచ్‌సీ పరిధిలోని జింకలబోడు, మంచికల్లు గ్రామాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చెంచులు, ఆదివాసీలు తమ చిన్నారులకు విద్యాబోధన అందించాలని, వారికి ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, ముఖ్యంగా సీజనల్ వ్యాధుల నివారణలో వైద్యుల సలహాలను పొందాలని, వర్షాకాలంలో మంచినీటిని కాచి చల్లార్చుకొని తాగాలని లేకుంటే డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వస్తాయని చెప్పారు. వీధుల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమల నివారణకు దోమతెరలు వాడాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాధులు వస్తాయని వివరించారు. ఈ సందర్భంగా 43 మందికి వివిధ రకాల పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డి.మురళీధర్, అమరేంద్ర, ఏఎన్‌ఎం రాణి, శాంతి, షేక్ సైదా బిలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవత విగ్రహాల ప్రతిష్ట ఐక్యతకు సూచకం

ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



నాభిశిల ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల రూరల్: గ్రామ ప్రజలంతా వర్గాలకు, పార్టీలకు అతీతంగా ఐక్యతగా మహా గణపతి నాభిశిల ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొనటం గ్రామ అభివృద్ధికి శుభసూచకమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాయవరం గ్రామంలో నాభిశిల ప్రతిష్టా మహోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో ఎప్పటి నుంచో ఉన్న పెద్దల ఆచారాలను, సమ్మకాలను వమ్ము చేయకుండా గ్రామ దేవతలను ఆరాధించుకోవటం గ్రామ ఐక్యతకు దోహదపడుతుందని, మహాగణపతి, మహాశీతల గమిడిశిల నాగేంద్ర స్వామి, కురందేవత, పోతురాజు వార్ల శిల ప్రతిష్ట మహోత్సవాన్ని బ్రహ్మశ్రీ పోతులూరి వీరభద్రాచార్య నేతృత్వంలో గ్రామస్తులంతా ఐక్యంగా జరుపుకోవటం ఆనందకరమన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. బ్రహ్మశ్రీ పోతులూరి మల్లిఖార్జున స్వామి నేతృత్వంలో హోమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, గ్రామస్తులు తదితరులున్నారు. అనంతరం సచివాలయంలోని రికార్డులను తనిఖీ చేసి సిబ్బందితో పలు విషయాలు చర్చించారు.

శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

వెల్దుర్తి: శానిటేషన్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై మూడు రోజుల పాటు గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను శానిటేషన్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ తరగతులు నిర్వహించాల్సిందిగా డైరెక్టర్ ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్, ఏపీఎస్ఐఆర్‌డీటీఆర్, విజయవాడ వారి ఆదేశాల మేరకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

ఈ నెల 12 నుంచి సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు

దుర్గి: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మండల పరిధిలోని సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జీఎల్ఎన్ గుప్తా తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఉదయం 10 గంటల నుంచి మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామ సర్పంచ్‌లు తప్పక హాజరుకావాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఎంఈవో పినాకపాణి



దాచేపల్లి : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో పినాకపాణి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లి ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల కోసం తయారు చేసే ఆహార పదార్థాలు పరిశుభ్రంగా ఉండాలని, రుచికరమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్యా విధానం గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు క్రమ పద్ధతిలో విద్యాబోధన చేయాలని చెప్పారు. ఎంఈవో వెంట హెచ్‌ఎం నాగేంద్ల ఏసయ్య, సీఆర్పీ చంద్రమోహన్ తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందజేస్తున్న అధికారులు

దుర్గి: మండలంలోని ఓబులేశునిపల్లె ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జిల్లా నోడల్ అధికారి, స్పెషలాఫీసర్ కె.సంజీవరావు తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం అందజేస్తున్న బాలామృతం, పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో అందించాలని అంగన్‌వాడీ టీచర్లను కోరారు. ప్రతి నెలా బాలింతలకు అందజేస్తున్న బాలామృతాన్ని సంబంధిత కిట్‌లను పంపిణీ చేయాలని, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం రికార్డులను, అటెండెన్స్, స్టాకు వివరాలను అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో జీఎల్ఎన్ గుప్తా, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్ కళ్యాణ్

మాచర్ల: వితంతు పింఛనుదారులు తమ హక్కులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని మాచర్ల సివిల్ జడ్జి కోర్టు జడ్జి శ్రీనివాస్‌కళ్యాణ్ చెప్పారు. శ్రీశైలం రోడ్డులోని రామకృష్ణ సేవాసమితి, బాలవిజ్ఞాన వికాస కేంద్రంలో న్యాయమూర్తి శ్రీనివాస్ శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎలాంటి చట్టపరమైన హక్కులకు ఇబ్బంది కలిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే అందుకు చట్టం ఉందని, మహిళలు దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వృద్ధులకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాంటివారికి న్యాయవాదులు, కోర్టు, పోలీసులు సంయుక్తంగా సహకరిస్తారన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి వెంకటేశ్వర్లు, స్వామి వివేకానంద సంస్థ వ్యవస్థాపకులు, నిర్వాహకులు మెట్టు గోవిందరెడ్డి, న్యాయవాది వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పిడుగురాళ్ల : మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు పిడుగురాళ్ల పరిధిలోని 6 గ్రామ వార్డు సచివాలయాల్లో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మురళీ గంగాధర్ రావు మాట్లాడుతూ వితంతువులు, వృద్ధులకు పింఛన్ ఇవ్వడంలో ఎవరూ కూడా అశ్రద్ధ చేయరాదన్నారు. సచివాలయాల ద్వారా ఎవరికైనా న్యాయం జరగకపోతే తప్పనిసరిగా కోర్టును ఆశ్రయించి న్యాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కుమారస్వామి, న్యాయవాదులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగు చేస్తున్న రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి కోరారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులకు నిర్వహించిన వరి రకాలపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వరి పంటను సాగు చేస్తున్న రైతులు విత్తన శుద్ధి చేయడం వలన చీడపీడల నుంచి రక్షణ లభిస్తుందని, అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. ఒక ఎకరం విస్తీర్ణంలో 20 నుంచి 25 కేజీల వరి విత్తనాలు, హెచ్‌ఎంటీ రకాలు అయితే 10 కేజీల విత్తనాలు సరిపోతాయన్నారు. ఎకరాకు 5 సెంట్ల నారుమడిలో విత్తనం చల్లే ముందు ఒక కేజీ నత్రజని, ఒక కేజీ భాస్వరం ముందుగానే చల్లుకోవాలని సూచించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ప్రైవేటు మార్కెట్ ద్వారా రైతులకు సుమారు 1,375 క్వింటాళ్ల వరి విత్తనాలను సరఫరా చేయడం జరిగిందన్నారు. రైతులు ఎక్కువగా బీపీటీ 5204, అంకూర్ పద్మ, పూజాగోల్డ్, పూజిత, శ్రీ అన్నపూర్ణ తదితర విత్తనాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. నాగార్జున సాగర్ రిజర్వాయర్ నిండటంతో మండలంలో అదనంగా మరో 1000 హెక్టార్లలో వరి పంట వేయడానికి రైతులు ఉత్సాహం చూపిస్తున్నట్లు దీంతో మొత్తం 3,264 హెక్టార్లలో వరి పంట సాగు చేయనున్నట్లు వెల్లడించారు.

ప్రమాద సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి

పిడుగురాళ్ల : తోటి మనుషులు ఎవరైనా ప్రమాదంలో ఉంటే పక్కన వారు అప్రమత్తంగా వ్యవహరించాలని వైద్యుడు నాగార్జున తెలిపారు. కార్ప్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం హార్ట్ స్ట్రోక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్ట్ స్ట్రోక్ వచ్చిన సమయంలో దగ్గరలో ఉన్న వ్యక్తులు సీపీఆర్ చేయాలని అలా చేస్తే ఆ వ్యక్తులను బతికించుకోవచ్చన్నారు. సీపీఆర్ విధానం ఎలా చేయాలి అన్న విషయాలను క్లుప్తంగా అవగాహన కల్పించారు.

కోనో కార్పస్ చెట్లను తొలగించాలి

అమరావతి: పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కోనో కార్పస్ చెట్లను తొలగించాలని విద్యా భారతి ఏపీ పర్యావరణ ప్రముఖ్ వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. వర్షాకాలంలో అవి పూతకు వస్తాయని వాటి పుప్పొడి రేణువుల వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సంబంధ వ్యాధులకు గురి అవుతారన్నారు. పక్షి వాలని చెట్టుగా వీటికి పేరుందని, దోమలను, కీటకాలను ఆకర్షించి పర్యావరణానికి హాని కలిగిస్తాయన్నారు. వేరు వ్యవస్థ బలంగా ఉండి భూగర్భ జలాలను ఎక్కువగా ఉపయోగించి నీటి కొరత ఏర్పడేలా చేస్తాయన్నారు. వీటిని తొలగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.